ఘనంగా నేషనల్ స్పోర్ట్స్ డే



తనుప్రీత్ కౌర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

లాలాపేట: మేజర్ ధ్యాన్ చంద్ జయంతి, నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలను శుక్రవారం తెలంగాణ అంధుల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తక్షశిలా స్కూల్ ప్రిన్సిపాల్ తను ప్రీత్ కౌర్ ముఖ్యతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించేలా కృషి చేయాలన్నారు. నిర్వాహకులు వై హరీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జితేందర్‌రెడ్డి, ఉమామహేశ్వరీ,కల్నల్ అనీల్‌కుమార్ యాదవ్,పవన్ కళ్యాణ్ తదితరులున్నారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత



అమీర్‌పేట: ఆటోలు, బస్సుల్లో పోగొట్టుకున్న సెల్ ఫోన్లను ఎస్ఆర్‌నగర్ పోలీసులు బాధితులకు అందజేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు.. 35 మంది అ జాగ్రత్తతో సెల్ ఫోన్లను పోగొట్టున్నారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఇడెండిటీ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా గుర్తించిన ఫోన్లను బాధితులకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో డీఐ గోపాల్,ఎస్సై రాజు రాథోడ్ పాల్గొన్నారు.

ఓయూలో జాతీయ సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీలో జాతీయ సదస్సు జరిగింది. గురువారం కళాశాల సీనియర్ అధ్యాపకులు ప్రొ. ప్రభాకర్ రెడ్డి ఉద్యోగ విరమణ పురస్కరించుకొని ఆడిటోరియంలో అడ్వాన్డ్ ప్రాసెస్ కంట్రోల్ సిస్టమ్స్ అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. కార్యక్రమానికి ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు అధ్యక్షత వహించగా ఐఐసీటీ సైంటిస్టు డాక్టర్ యమున రాణి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ ఇన్ అడ్వాన్స్‌డ్ ప్రాసెస్ కంట్రోల్ అనే అంశం పై మాట్లాడారు.

సమర్థులను వైస్ చాన్స్‌లర్‌గా నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: సమర్థవంతమైన ప్రొఫెసర్‌ను వైస్ ఛాన్స్‌లర్‌గా (వీసీ) నియమించాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య గురువారం సీఎం రేవంత్ రెడ్డిని ఒక ప్రకటనలో కోరారు. వర్సిటీలకు 15 రోజుల్లో నూతన వీసీలను నియమించి ఆ తరువాత అధ్యాపక ఖాళీలను భర్తీ చేస్తామని సీఎం ఇటీవల ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వివిధ కారణాలు, సమస్యల వల్ల ఓయూ ర్యాంకింగ్ పడిపోతోందన్నారు. ఓయూను అన్ని విధాలుగా చక్కదిద్దాలంటే కొత్తగా వచ్చే వీసీ పైన అనేక బరువు, భాత్యలు ఉన్నాయన్నారు.

పార్ట్ టైం అధ్యాపకుల వేతనం రూ.50 వేలు చెల్లించండి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల్లో పని చేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులకు ప్రతినెలా 12 నెలల పాటు రూ.50 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ ఆల్ వర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ (టీజీ ఆప్త) ఆధ్వర్యంలో అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం చర్చించేందుకు ఓయూలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్ట్ టైం అధ్యాపకులకు పర్మనెంట్ అధ్యాపకులతో సమానంగా అన్ని అర్హతలు ఉన్నకానీ ఏడాదిలో ఆరు నెలల పాటు మాత్రమే అరకొర వేతనంతో పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు రవీందర్ గౌడ్, నాగేంద్రం, మంచాల లింగస్వామి, కొండల్, భిక్షపతి, కుమార్, శ్రీలక్ష్మీరెడ్డి, రాజేష్, శంకర్, మహేష్, గంగాధర్, మినిగిరి రాము, భీమ్‌రావు, విఠల్, ముజాయిద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రాంగోపాల్‌పేట్: రైల్వే స్టేషన్ గేటు ముందు పడివున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసికున్నారు. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన మేరకు.. బుధవారం రాత్రి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ గేటు నంబర్ 3-4 మధ్య ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడివున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది వచ్చి పరీక్షించి చూసి అప్పటికే చనిపోయినట్లు తెలిపారు.

ఓయూ ఉద్యోగుల డిమాండ్స్ డే

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఉద్యోగులు డిమాండ్ డే కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం ఏఐయూఈసీ, తెలంగాణ వర్సిటీస్ నాన్‌టీచింగ్ అసోసియేషన్ పిలుపు మేరకు ఓయూ ఎన్‌జీవోస్ స్టాఫ్, టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్లు, ఎంప్లాయిస్ యూనియన్ మూడు సంఘాల ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో పాలన భవనం ఎదుట బైఠాయించి వివిధ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఎన్‌జీవోస్ అధ్యక్షులు బి.జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎలక్ట్రీషియన్ మృతి

వెంగళరావునగర్: గుండెపోటుతో ఎలక్ట్రీషియన్ మృతిచెందిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... విజయవాడకు చెందిన సురేష్ (30) గత కొంతకాలంగా రహమత్‌నగర్‌లో ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం గుండె నొప్పిగా ఉందంటూ తన రూంలో ఉంటున్న షేక్ మీరాకు ఫోన్ చేశాడు. అతను వచ్చేలోగా మెట్లమీద నుంచి కిందకు దిగే సమయంలో సురేష్ రోడ్డుమీద పడిపోయాడు. హుటాహుటిన మీరా 108కు ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి పరిశీలించి అప్పటికే సురేష్ మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మీరా ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

• డీసీ సుభాష్‌రావు



మెట్టుగూడలో వైద్య సిబ్బందికి సలహాలు ఇస్తున్న డీసీ సుభాష్‌రావు

సికింద్రాబాద్: విషజ్వరాలను అరికట్టి సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో ఆరోగ్యకర వాతావరణాన్ని నెలకొల్పేందుకు అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు కోరారు. గురువారం మెట్టుగూడ, సీతాఫల్‌మండి డివిజన్లలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన పలు స్కూళ్లలో జరిగిన డెంగీ తదితర వ్యాధుల అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం రెవడు డివిజన్లను సందర్శించిన డీసీ అక్కడ అందిస్తున్న వైద్య సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారీగా వెలవడుతున్న చెత్తను బయటకు తరలించేందుకు శానిటరీ విభాగం సిబ్బంది ని అప్రమత్తం చేశామన్నారు. ఇతర అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ సర్కిల్ పరిధిలో విష జ్వరాల వ్యాప్తిని నియంత్రిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, వైద్య ఆరోగ్యశాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

చాచానెహ్రూనగర్‌లో కార్పొరేటర్ పర్యటన



సీసీ నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ కె. హేమలత.

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్ ప్రాంతంలో గురువారం కార్పొరేటర్ కె. హేమలత పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను...ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ కె. హేమలత మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి...డివిజన్ సమగ్రాభివృద్ధి నిర్దిష్టమైన కార్యచరణతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకొని సంబంధించి విభాగాల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అచ్చా, రమేష్, వెంకట్ యాదవ్, భూషణం, అబ్బాస్, కుషాల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలి

బౌద్ధనగర్: గణపతి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, డీసీ సుభాష్‌రావులు తెలిపారు. వినాయక చవితిని పురస్కరించుకొని గురువారం బౌద్ధనగర్‌లోని ఏసీపీ కార్యాలయంలో జీహెచ్ఎంసీ, ఎలక్ట్రికల్, ఇతర విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను పురస్కరించుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసు, జీహెచ్ఎంసీ, ఎలక్ట్రికల్ తదితర విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డీసీ సుభాష్‌రావు, ఇన్‌స్పెక్టర్లు సైదులు, అనుదీప్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి

రాష్ట్రపతి నిలయంలో ముగిసిన వేడుకలు



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

రసూల్‌పురా: తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన వివిధ కార్యక్రమాలు గురువారం ముగిసాయి. రాష్ట్రపతి నిలయం పరిపాలనాధికారి రజని ప్రియా ఆధ్వర్యంలో గిడిగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు గొప్పతనాన్ని ప్రాముఖ్యతను తెలియజేస్తూ కవితలు, కథనాల రూపంలో ప్రదర్శించారు.

విద్యార్థులకు స్టేషనరీ వితరణ

సికింద్రాబాద్: తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాల వేడుకలను సీతాఫల్‌మండి డివిజన్ బ్రాహ్మణ బస్తీ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కుసుమ కుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు మాజీ కార్పొరేటర్ పి.స్వరూపగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వరూపగౌడ్‌తోపాటు కుసుమ ఫౌండేషన్ ప్రతినిధులు విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసి సందడి చేశారు. అనంతరం విద్యార్థులకు నోటు బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు.



విద్యార్థులతో కుసుమకుమారి ఫౌండేషన్ ప్రతినిధులు

వర్సిటీల రిక్రూట్‌మెంట్ ఎలా చేస్తారు...?

మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబులను నిలదీసిన కాంట్రాక్టు అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల్లో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లను (కాంట్రాక్టు) పర్మనెంట్ చేయకుండా కొత్త రిక్రూట్‌మెంట్ ఎలా చేస్తారని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్ బాబులను కాంట్రాక్టు అధ్యాపకులు నిలదీశారు. గురువారం తెలంగాణ ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ జేఏసీ ఆధ్వర్యంలో మంత్రులను కలసి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందచేసినట్లు తెలిపారు. కొన్నేళ్లుగా వర్సిటీల్లో పర్మనెంట్ నియామకాలు లేనందున ఉన్నత విద్యా బోధనను తమ భుజస్కంధాలపై వేసుకొని తక్కువ వేతనానికి 26 సంవత్సరాలుగా పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసగించిందని మంత్రులకు వివరించిన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విజయేందర్ రెడ్డి, ఉపేందర్, సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

స్పా నిర్వాహకుడిపై కేసు నమోదు

వెంగళరావునగర్ : నిబంధనలు పాటించకుండా స్పా నిర్వహిస్తున్న వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... ఎస్ఆర్‌నగర్ సమీపంలో పి.నవీన్‌గౌడ్ యాపిల్ బ్యూటీ సెలూన్ అండ్ స్పా పేరుతో సెలూన్ స్పా నిర్వహిస్తున్నాడు. అయితే నిబంధనలు పాటించడం లేదని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మధురానగర్ పోలీసులు దాడి చేసి పరిశీలించగా కొన్ని నిబంధనలు పాటించనట్టుగా నిర్ధారణ అయింది. సీసీ టీవీలు కొన్ని పనిచేయడం లేదని, థెరపీ చేసే ఇరువురు మహిళలకు అధికారిక సర్టిఫికెట్ లేదని, కస్టమర్స్ రిజిస్టర్ కూడా సక్రమంగా మెయింటెయిన్ చేయడం లేదని తెలుసుకున్నారు. దీంతో స్పా అండ్ సెలూన్ నిర్వాహకుడు నవీన్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలకు శానిటరీ వెండింగ్ యంత్రం అందజేత

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ కీస్ హైస్కూల్‌లో విద్యార్థినులకు శానిటరీ వెండింగ్ యంత్రాన్ని అందించారు. సత్కర్మ సేవా మిషన్ ఆధ్వర్యంలో పాఠశాలకు వితరణగా ఇవ్వగా స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక చేతుల మీదుగా పాఠశాల యాజమాన్యానికి అందించారు. 900 మంది విద్యార్థినులు చదివే ఈ పాఠశాలలోని విద్యార్థినులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని కార్పొరేటర్ అన్నారు. సంఘం అధ్యక్షురాలు సోనియా, బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు ప్రియాంక, కవిత, సునంద, లావణ్య, సంగీత తదితరులు పాల్గొన్నారు.



శానిటరీ వెండింగ్ మిషన్‌ను అందించిన దృశ్యం

అర్హులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి

సనత్‌నగర్: బండమైసమ్మనగర్‌లో అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కోరారు. గురువారం బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన బండమైసమ్మ బస్తీ వాసులు మారేడుపల్లిలోని తలసాని నివాసంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి గతంలో ఈ ప్రాంతంలో 255 ఇండ్లకు అర్హులైన లబ్ధిదారులకు కేటాయించారని, మిగిలిన ఇండ్లను కూడా వీలైనంత త్వరగా అర్హులను గుర్తించి కేటాయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేషన్ రాజు, రాజు, సతీష్, జగదీష్, శ్రీహరి, శ్రీనివాస్, వినయ్ తదితరులున్నారు.

హైడ్రాను రాష్ట్రమంతా విస్తరించాలి

లాలాపేట: చెరువులు, నాలాలపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న హైడ్రాకు తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు టి జాక్ చైర్మెన్ ప్రొ ఇటికాల పురుషోత్తమ్, హైదరాబాద్ జిల్లా చైర్మెన్ శ్రీరామ్ శివకుమార్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హైడ్రాకు సంపూర్ణ అధికారాలు ఇవ్వడం హర్షించదగ్గ విషయం అన్నారు. హైడ్రా సేవలను ప్రజలందరూ ఆమోదిస్తున్నారని పేర్కొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు



శ్రీ కృష్ణాష్టమి ముగింపు వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలోని త్రీ స్టార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ మూడు రోజుల పాటు నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకలు గురువారం ముగిశాయి. ముగింపు వేడుకల ప్రత్యేక పూజలకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండపంలో ప్రతిష్టించిన శ్రీ కృష్ణుడి విగ్రహం వద్ద ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేడుకలు ముగిసినట్టు నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో త్రీ స్టార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు బొగ్గుల కృష్ణ, చెన్నయ్యగౌడ్, భాస్కర్‌రావు, అశోక్‌కుమార్, వైదీ బాలాజీ పాల్గొన్నారు.

కిమ్స్-సన్‌షైన్‌ను సందర్శించిన మాల్దీవ్స్ బృందం

సనత్‌నగర్: మాల్దీవ్ హెల్త్‌కేర్ ప్రతినిధి బృందం గురువారం బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిని సందర్శించింది. మాల్దీవ్ హెల్త్‌కేర్ నుంచి మామాలి సిటీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఈవో ఇబ్రహీం అబ్దుల్ రజాక్ హలీం నేతృత్వంలోని డిప్యూటీ సీఈవో డాక్టర్ షా అబ్దుల్లా మహిర్, మహమద్ ముబరూక్ తదితరులు ఆస్పత్రిని సందర్శించారు. ఇక్కడ అందుతున్న వైద్య సదుపాయాలు, ఆధునిక వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఏవీ గురువారెడ్డి ఇక్కడ అందుతున్న వైద్య సేవలను వివరించారు.

సనత్‌నగర్: మాల్దీవ్స్‌కు చెందిన మాల్దీవ్ హెల్త్‌కేర్ ప్రతినిధి బృందం గురువారం బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిని సందర్శించింది. మాల్దీవ్ హెల్త్‌కేర్ నుంచి మామాలి సిటీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఈవో ఇబ్రహీం అబ్దుల్ రజాక్ హలీం నేతృత్వంలోని డిప్యూటీ సీఈవో డాక్టర్ షా అబ్దుల్లా మహిర్, మహమద్ ముబరూక్ తదితరులు ఆస్పత్రిని సందర్శించి ఇక్కడి వైద్య సదుపాయాలు, ఆధునిక వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఏవీ గురువారెడ్డి మాట్లాడుతూ ఆధునిక వైద్య సేవలను మరింత విస్తృతం చేయడంతో పాటు వైద్యరంగంలో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ విస్తరించేందుకు తమ ఆస్పత్రి ముందుంటుందని అన్నారు. వైద్య, ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు తగిన సహాయ, సహకారాల విషయంపై వారు డాక్టర్ గురువారెడ్డితో చర్చించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీవోవో సుధాకర్ జాదవ్, ఇంటర్నేషనల్ హెడ్ గోకుల్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని పేదలను ఇబ్బందులు పెట్టొద్దు



అధికారులతో మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

రాంగోపాల్‌పేట్: విద్యుత్, ఎలక్ట్రికల్ బిల్లులు చెల్లించాలని పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం బేగంపేట డివిజన్‌లోని జవహర్‌జనత, బర్తన్ కాంపౌండ్ బస్తీల్లో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, బిల్లులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు జీరో విద్యుత్ బిల్లులు అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయకపోవగా పేదలను మరింత ఒత్తిడికి గురిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి, డీసీ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, ఎలక్ట్రికల్ డీఈ దుర్గాప్రసాద్, జలమండలి జీఎం వినోద్, డీజీఎం ఆశిష్, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, నరేందర్, కిషోర్, శేఖర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలు ఇస్తే దివ్యాంగులు అద్భుతాలు సృష్టిస్తారు



నీపెడ్‌లో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న వక్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు

కంటోన్మెంట్: దివ్యాంగులకు తగి అవకాశాలు కల్పించి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని 'వీల్ చైర్ వారియర్' డాక్టర్ సాయి కౌస్తవ్ దాస్‌గుప్తా అన్నారు. దివ్యాంగులకు కూడా సమాజంలో అందరితోపాటే సమాన హక్కులు ఉంటాయని, వారిలోని నైపుణ్యాలను గురించి తెలుసుకుంటే వారికి అవకాశాలు ఇవ్వడం సాధ్యమవుతుందన్నారు. యంగ్ ఇండియా సంస్థ చొరవతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజేబుల్‌నెస్ (నైపెడ్) ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని మనోవికాస్ నగర్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కౌస్తవ్ దాస్ గుప్తా దివ్యాంగులను ఉద్దేశించి స్ఫూర్తిదాయకమైన ప్రసంగం ఇచ్చారు. దివ్యాంగుల కోసం ఇంత మంచి కార్యక్రమం నిర్వహించిన యంగ్ ఇండియన్స్ యాక్సెసబిలిటీ బృందాన్ని, దివ్యాంగుల కోసం వారు చేపట్టిన ప్రభావవంతమైన కార్యక్రమాలను నైపెడ్ డైరెక్టర్ రామ్ కుమార్ ప్రశంసించారు. సమర్థవంతమైన లింక్డ్‌ఇన్ ప్రొఫైల్ ఎలా రూపొందించాలో వివరించారు.

పాతనేరస్తుడి అరెస్ట్

రసూల్‌పురా: బోనాల జాతరలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడి పరారీలో ఉన్న పాత నేరస్తుడిని కార్ఖాన పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి బంగారు చైన్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అందించిన వివరాల మేరకు గత నెల 12వ తేదిన కార్ఖాన పీఎస్ పరిధిలోని మహంకాళి ఆలయం బోనాల జాతర సందర్భంగా నగరంలోని మల్లేపల్లికి చెందిన పాత నేరస్తుడు మహమ్మద్ జహంగీర్ (30) తో పాటు ముఠా సభ్యులు మహ్మద్ మీర్, షఫీ, మైనర్ బాలుడు మహమ్మద్ షకిల్ (పరారీలో ఉన్నారు) రద్దీగా ఉన్న సమయంలో బంగారు గోలుసు అపహరించారు. బాధీతుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి సీసీ ఫుటేజి ఆధారంగా పిక్‌పాకెటింగ్ పాల్పడే మహ్మద్ జహంగీర్‌ను ఈ నెల 28న అరెస్టు చేసి అతని వద్ద నుంచి 10 గ్రాముల బంగారు చైన్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ముగ్గురి నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.



నిందితుడు మహ్మద్ జహంగీర్

గుర్తుతెలియని వృద్ధుల మృతదేహాలు స్వాధీనం



చిలకలగూడ : గుర్తుతెలియని ఇరువురు వృద్ధుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. సీతాఫల్‌మండి డివిజన్ మైలార్‌గడ్డ పద్మావతి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ వద్ద ఓ వృద్ధుడు పడి ఉన్నట్లు గురువారం ఉదయం అందిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.అయితే అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీలో భద్రపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎఎస్ఐ స్వామి తెలిపారు.

మరో ఘటనలో..

సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి సమీపంలోని మెట్రోస్టేషన్ పిల్లరు నంబరు బీ1026 వద్ద ఓ వృద్ధుడు మృతి చెందిపడున్నట్లు మెట్రోస్టేషన్ కంట్రోలర్ ప్రవీణ్ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించామని హెచ్‌సీ రవి తెలిపారు. మృతుని కుటుంబసభ్యులు, బంధువులు గుర్తుపడితే చిలకలగూడ పోలీసులకు నేరుగా లేదా ఫోన్ నంబర్లు 040-27853597, 8712661252కు సమాచారం అందించాలని చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ కోరారు.

రోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షించిన కార్పొరేటర్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని బ్రాహ్మణబస్తీ, మధురానగర్ ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు నిర్మాణం పనులను గురువారం కార్పొరేటర్ సామల హేమ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక చవితి నవరాత్రి వేడుకలు పురస్కరించుకుని వేడుకల నిర్వాహకులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు త్వరితగతిన రోడ్డు నిర్మాణం పనులు చేపిస్తున్నామన్నారు.



కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల పర్మనెంట్ చేయాలని వర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ (కాంట్రాక్టు) నేతలు డిమాండ్ చేశారు. గురువారం వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల రాష్ట్ర స్థాయి సమావేశం ఓయూలో జరిగింది. వివిధ అంశాల పై చర్చించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి 15 రోజుల్లో వర్సిటీలకు వీసీల నియమకంతో పాటు అధ్యాపకుల పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అయితే రెగ్యులర్ అధ్యాపకుల రిక్రూట్‌మెంట్‌కు ముందు ఆయా వర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పరుశురామ్, ఇతర నాయకులు వంగరి భూమయ్య, టి.శ్రీశైలం, జితేందర్ రెడ్డి, తిరుపతయ్య, యశ్వంత్ రావు, విజయ్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.